క్లుప్తంగా

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు



మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదల గ్రామంలో పంచాయతీ సిబ్బంది శనివారం పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలో పలువురు విషజ్వరాలు బారిన పడుతుండటంతో పంచాయతీ సిబ్బంది ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఎస్సీ కాలనీ, ముస్లిం కాలనీలో ప్రధాన రహదారి వెంబడి వ్యర్థాలను తొలగించారు. మురుగు కాల్వల్లో నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు చేపట్టారు. పనులను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు తిరుమలశెట్టి సైదుబాబులు పర్యవేక్షించారు.

బాలికలను రక్షించుకోవడం అందరి బాధ్యత



దమ్మాలపాడు(ముప్పాళ్ల): ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ పరిధిలోని ఇరుకుపాలెం సెక్టారులో ఉన్న దమ్మాలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్‌శక్తిలో భాగంగా బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి మాట్లాడుతూ.. బాల్య వివాహాలను, బాల కార్మిక వ్యవస్థలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. పిల్లలందరూ బడిలోనే ఉండాలని, అక్షరాస్యత శాతాన్ని పెంచేలా అందరూ కృషి చేయాలన్నారు. ఆడపిల్లలను రక్షించాలని, చదివించి ముందుకు నడిపించాలని సూచించారు. సంబంధిత చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలి



రాజుపాలెం: ఉద్యాన పంటలకు కూడా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి సీహెచ్ రమణారెడ్డి తెలిపారు. మండలంలోని రాజుపాలెంలో నమోదు ప్రక్రియ జరుగుతున్న తీరును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పండ్ల తోటలు ఉన్న రైతులకు సూచనలు, సలహాలు అందించారు. ఆయన వెంట మండల ఉద్యాన శాఖాధికారి డి.నవీన్, సహాయకులు సుచరిత, రమేష్ తదితరులు ఉన్నారు.

దొంగకు దేహశుద్ధి

నాదెండ్ల: దొంగతనానికి యత్నిస్తూ స్థానికులకు చిక్కిన వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన శుక్రవారం రాత్రి గణపవరం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొత్త కోదండ రామాలయం సమీపంలోని గాలి బుచ్చయ్య ఇంటి డాబా మీదకు రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. స్థానికులు గమనించి అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలడిగితే తన పేరు శీను అని, తన ఊరు పోలవరం అని మాత్రమే చెప్పాడు. సదరు వ్యక్తి గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

డాక్టర్ విలియం కేరీ సేవలు భావితరాలకు చెప్పాలి

నరసరావుపేట: దేశంలో బాప్టిస్టు సంఘాలకు పితామహుడిగా పేరుపొందిన డాక్టర్ రెవరెండ్ విలియంకేరీ గురించి భావితరాలకు తెలియచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలుగు బాప్టిస్ట్ కౌన్సిల్ అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. శనివారం విలియం కేరి 263వ జయంతి వేడుకలను పట్టణంలోని బాప్టిస్టు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేకును కట్ చేశారు. ఈసందర్భంగా పలువురు వక్తలు కేరీ గురించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వారి పేరుపై పోస్టల్ స్టాంప్ విడుదల చెయ్యడం చాల గర్వకారణమని స్పష్టం చేశారు. పాస్టర్లు ఆశీర్వాదం, అనిల్, జాన్ బాబు, ఏసుపాదం, ఆదాము, దానం, జీవరత్నం, మహిళ పాస్టర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మండల విద్యాశాఖ అధికారి డి. బ్రహ్మేశ్వర రావు శనివారం పరిశీలించారు. వంటశాల పరిసరాలను తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులకు అందజేస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచి చూశారు. విద్యార్థులకు భోజన వడ్డన చేశారు. తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నాణ్యతా పరిమాణాలను మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. నిర్ణీత మెనూను విధిగా విద్యార్థు లకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు

వైద్య సిబ్బంది నిరసన ర్యాలీ

పెదకూరపాడు: కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ పలుచోట్ల వైద్యులు, వైద్యసిబ్బంది నిరసన తెలిపారు. బాధితురాలికి న్యాయం చేయడంతోపాటు ఇలాంటి ఘటనలు, వైద్యులపై దాడులు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేశారు. 75 త్యాళ్లూరులో పీహెచ్‌సీ వైద్యులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ విద్య మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందిస్తున్న వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉందన్నారు. పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి కచేరీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు.

అమరావతి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. శనివారం వైద్యాధికారి చందులాల్ ఆధ్వర్యంలో అమరేశ్వరాలయ గాలి గోపురం సెంటర్ మీదుగా గాంధీ బొమ్మ వరకు ర్యాలీ కొనసాగింది. సుమారు గంట పాటు ఓపీ సేవలు నిలిపివేశారు.



అమరావతిలో ర్యాలీ చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు, సిబ్బంది



75 త్యాళ్లూరులో కొవ్వొత్తులతో నివాళి

సత్తెనపల్లి: స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు చెందిన వైద్యులు, సిబ్బంది శనివారం రెండు గంటల పాటు విధులు బహిష్కరించారు. పట్టణంలోని ప్రయివేటు వైద్యులు, వైద్య విద్యార్థినులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. కోల్‌కత్తాలో హత్యాచారానికి గురైన వైద్యురాలికి న్యాయం చేయాలని నినదించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



పెదకూరపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



సత్తెనపల్లిలో నిరసన తెలుపుతున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది



సత్తెనపల్లి పట్టణంలో నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య విద్యార్థినులు

వ్యాధులపై అప్రమత్తత అవసరం

అచ్చంపేట: సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి తెలిపారు. శనివారం ఆమె ఆధ్వర్యంలో నాలుగు గ్రామాలలో వైద్యశిబిరాలను నిర్వహించారు. జ్వరపీడితులకు పరీక్షలు చేశారు. గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు పంపారు. కొండూరు, నిండుజర్ల, పెదపాలెం, మిట్టపాలెం గ్రామాలలో శిబిరాల నిర్వహణతోపాటు దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయించారు. కాలువలలో బ్లీచింగ్ చల్లించారు. మిట్టపాలెంలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పెదపాలెంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్రవంతి

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బెల్లంకొండ: ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన కె.గోపయ్య బెల్లంకొండ క్రాస్‌రోడ్‌కు వచ్చేందుకు ఆటో ఎక్కి వెనుక కూర్చున్నాడు. నాగిరెడ్డిపాలెం వద్దకు రాగానే ఆటో ఆగింది. క్రోసూరు నుంచి బెల్లంకొండ క్రాస్ రోడ్ వైపు వస్తున్న లారీ ఈ ఆటోను వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో గోపయ్యకు కుడి కాలు విరిగిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే లారీని ఆపేశారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిపారు. గోపయ్యను 108 వాహనంలో సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రాజేష్ తెలిపారు.



ఆటోలో గాయాలపాలైన గోపయ్య

పది విద్యార్థులకు 'ట్యాగ్' పరీక్ష

నరసరావుపేట రూరల్: సీబీఎస్ఈ పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 19వ తేదీ సోమవారం నుంచి నిర్వహించాల్సి ఉన్న బేస్‌లైన్ ఎగ్జామ్ విద్యార్థులకు పరీక్షగా మారింది. ఈ పరీక్షకు సంబంధించి శనివారం మధ్యాహ్నం మోడల్ పరీక్ష విద్యార్థులకు నిర్వహించారు. ఈ పరీక్షలో పాల్గొనాలంటే విద్యార్థుల ఐడీతో ట్యాగ్ చేయాల్సి ఉంటుంది. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో 231 మంది పదవ తరగతి విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పాఠశాలలో నెట్ సిగ్నల్ సరిపోకపోవడంతో ఐడీ ట్యాగ్ చేయడంలో అవాంతరం ఏర్పడింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. పాఠశాలలోని ఉపాధ్యాయిల సెల్‌ఫోన్ నుంచి హాట్ స్పాట్ ద్వారా కొంతమంది విద్యార్థుల ఐడీని ట్యాగ్ చేశారు. ఈ ప్రక్రియ ఆలస్యం అవుతుండటంతో విద్యార్థుల్లో కొంతమందిని ఎంఈవో ఆఫీసుకు, మరికొంత మందిని సమీపంలో వైఫై ఉన్న ఉపాధ్యాయిల ఇళ్లకు పంపించారు. నెట్‌సిగ్నల్ సమస్య కారణంగా విద్యార్థుల ఐడీని ట్యాగ్ చేయడంలో కొంత సమస్య ఏర్పడిందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి తెలిపారు. విద్యార్థులు అందరూ పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



పాఠశాలలో ట్యాబ్‌లతో విద్యార్థులు

విత్తనశుద్ధితో రైతులకు ఎంతో మేలు

ఏవో రామారావు

శావల్యాపురం: ఖరీఫ్ సీజనులో వరి పంటను సాగు చేస్తున్న రైతులు విత్తన శుద్ధి చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. శనివారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ నారుమడులు సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలని, విత్తనశుద్ధి చేయటం ద్వారా అధిక దిగుబడులతో పాటు అనేక ప్రయోజనాలు పొందవచ్చునన్నారు. వరి పంట సాగు చేసే రైతులు ఒక ఎకరం పొలంలో 20 నుంచి 25 కేజీల విత్తనాలను సరిపోతాయన్నారు.

ఎకరాకు 5 సెంట్లు నారుమడిలో విత్తనం చల్లే ముందు ఒక కేజీ నత్రజని, ఒక కేజీ భాస్వరం వాడాలన్నారు. పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పును కలిపి ఎంపిక చేసుకున్న విత్తనాలను పోయగా నీటి అడుగున మునిగి ఉన్న గట్టి విత్తనాలను నారు పోసుకోవాలన్నారు. నారుమడిలో ఆకు తినే పురుగులు సోకకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వరి పంటకు సక్రమించే వివిధ తెగుళ్ల చీడపీడల నివారణకు సస్య రక్షణ చర్యలు రైతులు చేపట్టాలన్నారు. వరి పంట చుట్టూ గట్టుపై కంది పంటను అంతర్ పంటగా సాగు చేయటం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు.



పిచికలపాలెంలో సాగులో ఉన్న వరి నారుమడి

సెప్టెంబర్‌లో ఆటల పోటీలు

నరసరావుపేట రూరల్: అండర్-14, అండర్-17 బాల, బాలికల స్కూల్ గేమ్స్ మండల స్థాయి ఆటల పోటీలు సెప్టెంబర్ రెండవ వారంలో నిర్వహించనున్నట్టు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి చప్పిల్లి కోటేశ్వరరావు తెలిపారు. లింగంగుంట్లలోని శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు సెప్టెంబర్ మూడవ వారంలో, జిల్లా స్థాయి పోటీలు చివరి వారంలో నిర్వహిస్తామని తెలిపారు. పోటీలకు బాల, బాలికలను సిద్ధంచేయాలన్నారు. పోటీలలో పాల్గొనే వారికి వసతి, భోజన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలుతీసకుంటున్నట్టు తెలిపారు.

మండలానికి ఇద్దరు ప్రజా సేవక్‌లు

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు మండలానికి ఇద్దరు ప్రజాసేవక్‌ల చొప్పున ఐదు మండలాలలో నియమించినట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం ప్రకటించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి మండలంలో పార్టీ కార్యాలయంలో ఒకరు, క్షేత్రస్థాయిలో మరొకరు సమస్యలు తెలుసుకుంటూ తన దృష్టికి తీసుకొస్తారని తెలిపారు.

ఎస్ఎంసీ చైర్మన్‌గా సాంబశివరావు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీకి ఈ నెల 8న జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రిన్సిపల్ అరుణ్‌కుమార్ శనివారం ఎన్నికలను నిర్వహించారు. చైర్మన్‌గా చిగురుపాడుకు చెందిన దుద్దుల సాంబశివరావు, ఉప చైర్మన్‌గా పెదపాలెం ఆర్ అండ్ ఆర్ సెంటర్‌కు చెందిన భూక్యా స్వాతీబాయిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందించారు.

బిడ్డను అప్పగించాలని తల్లి ఫిర్యాదు

పెదకూరపాడు: అత్తింటి వారి వద్ద ఉన్న తన బిడ్డను అప్పగించాలని పెదకూరపాడు పోలీసులకు బత్తుల రోజ్‌మేరీ అనే మహిళ శనివారం ఫిర్యాదు చేశారు. పెదకూరపాడు మండలం హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన బత్తుల రోజ్‌మేరితో గుంటూరులోని స్వర్ణభారతినగర్‌కు చెందిన అంబేడ్కర్ అలియాస్ కిరణ్‌కు 2013లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. భర్త మద్యం తాగి ఇబ్బంది పెడుతున్నాడని, భరించలేక పుట్టింటికి బిడ్డను తీసుకుని వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నానని బాధితురాలు చెప్పారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుమారుడిని భర్త తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బిడ్డను అప్పగించాలని, అత్తింటి వారి వేధింపులు లేకుండా చూడాలని కోరారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విప్పర్ల వెంకట్రావు తెలిపారు.

సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి

నకరికల్లు: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా కుడికాలువకు విడుదల చేస్తున్న సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఎన్నెస్పీ జేఈ రామకృష్ణ శనివారం రైతులకు సూచించారు. కాలువ పరిధిలోని జోన్-1గా కేటాయించిన గుంటూరు, పల్నాడు జిల్లాలకు ఆగస్టు రెండవ వారం నుంచి, జోన్-2 పరిధిలోని ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సెప్టెంబర్ మొదటి వారం నుంచి సాగునీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయకట్టు పరిధిలోని వరి, మిర్చి, పత్తి తదితర పంటలు సాగు చేసే రైతులు నీటిని వృథా చేయవద్దన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం లాంగ్వేజ్‌ల బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాలను మండల విద్యా శాఖ అధికారి డి. బ్రహ్మేశ్వరరావు ప్రారంభించారు. ఇంగ్లిషు, తెలుగు సబ్జెక్ట్‌లలో విద్యాబోధనను రిసోర్స్ పర్సన్స్ వివరించారు. అలవాల, విప్పర్లపల్లి, రొంపిచర్ల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు రొంపిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించగా, వి.రెడ్డిపాలెం, సంతగుడిపాడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు సోమవారం ముగియనున్నాయి.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

సత్తెనపల్లి: పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించటం అభినందనీయమని సీనియర్ న్యాయవాది దస్తగిరిరావు అన్నారు. పట్టణంలోని ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో చిట్టా ఈశ్వర్‌సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు కళాశాలలకు చెందిన 20 మంది పేద విద్యార్థులకు శనివారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దస్తగిరిరావు మాట్లాడుతూ.. ఉన్నతంగా చదువుకోవటం వల్ల జీవితంలో మంచిగా స్థిరపడవచ్చన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డు కాకూడదని పేర్కొన్నారు. ట్రస్ట్ సహకారం ఎంతో విలువైనదన్నారు. న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ మాట్లాడుతూ.. చిట్టా ఈశ్వర్‌సాయి చారిటబుల్ ట్రస్ట్ ప్రతి ఏడాది విద్యార్థులకు సహకారం అందించటం హర్షణీయమని పేర్కొన్నారు. పలు కళాశాలలకు చెందిన 20 మందికి రూ.5 వేల చొప్పున ట్రస్ట్ నిర్వాహకులు చిట్టా విజయభాస్కరరెడ్డి అందించారు. కార్యక్రమంలో వేద కళాశాల అకాడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్యప్రకాష్, ప్రగతి కళాశాల ఇన్‌చార్జి రావిపాటి వాసు, కృష్ణారెడ్డి, వీరవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న చిట్టా విజయభాస్కరరెడ్డి తదితరులు

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి

సత్తెనపల్లి: వీఆర్ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించనందుకు సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట డివిజన్ గ్రామ రెవెన్యూ సహాయకులు శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. పల్నాడు జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో 16 అటెండర్, 6 నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఏళ్లుగా భర్తీ చేయడం లేదన్నారు. వీఆర్ఏలతో అక్రమంగా ఈ డ్యూటీలు చేయిస్తున్నారని వాపోయారు. రూల్స్ ప్రకారం ఈ డ్యూటీలు తమతో చేయించరాదన్నారు. పేస్కేలును తెలంగాణ తరహాలో అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను సీనియార్టీ ఆధారంగా వీఆర్ఏలతో భర్తీ చేయాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు అందించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షులు సంజీవరావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఆయా మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, ముస్తఫా, కాసులు, రాజు, సుందర్‌రావు, రమేష్, బుడే, సిద్ధయ్య, సీతయ్య, శ్రీను, కోటేశ్వరరావు, కరిముల్లా, రవి, గణేష్, బ్రహ్మయ్య, శ్యాంసన్, మురళి, వీఆర్ఏలు పాల్గొన్నారు.



సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సంఘం ప్రతినిధులు

వైభవంగా స్వామి వారి కళ్యాణోత్సవం



కళ్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు



ప్రాంగణంలో డప్పు కళాకారుల వాయిద్యం

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెంలో వేంచేసి ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మూడో రోజు ప్రథమ పుష్కర ద్వాదశ వార్షికోత్సవంలో భాగంగా శనివారం స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. దేవస్థానం నిర్వాహకులు, బాలాజీ టెంపుల్ ట్రస్టు చైర్మన్ పాతూరి వెంకటరమ సుబ్బారావు దంపతులతోపాటు 30 జంటలు పాల్గొన్నాయి. తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం కృష్ణా జిల్లా చల్లపల్లి డప్పు శ్రీనివాసు బృందం డప్పు వాయిద్యం చూపరులను ఆకట్టుకుంది. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని బాలాజీ ట్రస్టు చైర్మన్ తెలిపారు.

రాష్ట్రస్థాయి విద్యాభారతి ఆటల పోటీలు

- పాల్గొన్న 650 మంది విద్యార్థులు
- రెండు రోజులపాటు నిర్వహణ

నరసరావుపేట రూరల్: రెండు రోజుల పాటు జరుగనున్న విద్యా భారతి రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు శనివారం ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యాభారతి పాఠశాల్లోని విద్యార్థులు 650 మంది ఈ పోటీలకు హాజరయ్యారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, ఈశ్వర్ కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కొత్త వెంకట రామకృష్ణ, కన్నా భాస్కరరావు, జిగురు ప్రతాప్‌సింగ్ శాస్త్రి, మిరియాల నాగప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. అతిథులు క్రీడా పోటీల జెండాను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన కవాతు ప్రత్యేక ఆకర్షనగా నిలిచింది. విద్యార్థులకు షటిల్, కబడ్డీ, యోగ, ఖోఖో, చదరంగం, వాలీబాల్‌తో పాటు వ్యక్తిగత పోటీలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు దక్షిణ క్షేత్ర స్థాయిలో జరిగే ఏపీ, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ విధంగా అఖిల భారత స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతల పేర్లను స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు నమోదు చేస్తారని వివరించారు.



పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు

ఎన్‌సీసీలో వన్ క్యాడెట్-వన్ ట్రీ కార్యక్రమం

నరసరావుపేటరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎస్‌ఈసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో వన్ క్యాడెట్ వన్ ట్రీ కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ మేడికొండ రాజేష్‌బాబు మాట్లాడుతూ సమాజ సేవలో ముందుండే ఎన్‌సీసీ క్యాడెట్స్ మరో సారి సమాజం పట్ల వారికున్న బాధ్యతను గుర్తు చేసుకున్నారని తెలిపారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి ప్రమాదం లేకుండా మానవాళి మనుగడకు అవసరమైన పర్యావరణాన్ని అందించేందుకు మొక్కలు నాటుతున్నట్టు తెలిపారు. కళాశాలలోని 80 మంది క్యాడెట్స్ ఒక్కో మొక్క చొప్పున నాటి వారి సంరక్షణకు చేపడతారని తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని 23వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్, కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వ్యాయామ అధ్యాపకుడు ఎల్.కృష్ణారెడ్డి అభినందించారు.

ప్రకటన

నా క్లయింట్లు M/s. Shriram Finance Ltd., Governorpet Branch, VJA ...

... Regd. Post with Ack Due ద్వారా తెలియజేయగలరు. ...

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., Vijayawada. ✆ 9849431432

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

(సత్తెనపల్లి, పెదకూరపాడు)
9912225439
Office mail : sakshigntadvt@gmail.com